# ఇన్‌స్టెంట్ యాక్టర్స్

- అల్లూరి గౌరీలక్ష్మి

రిజిష్టర్‌లో సైన్ చేసి సీట్లో కూర్చుంది వినీల. అటెండర్ వీరాస్వామిని పిల్చి అడిగింది మెల్లగా. ''నిన్న నేను రాలేదు కదా బాస్ మొత్తుకున్నాడా?''

''అమ్మబాబో! మెత్తుకొనుడులో అలా గిలాక్కాదు తల్లీ! ఇలా గబుక్కున మానేస్తే తనకి లాగి లెంపకాయ కొట్టినట్టుంటుందంటమ్మా! అసలు ఆడవాళ్ళకి ఉద్యోగాలు ఇచ్చినోళ్ళది తప్పన్నాడు. వాళ్ళు ఇంట్లో ముగ్గులెయ్యడానికీ, వంట లొండడానికీ మాత్రమే తగునన్నాడు. పక్క సెక్షన్‌కి పోయి ఎవరినన్నా టైపిస్టుని తోలుకు రమ్మన్నాడు. ఈ సంగత్తెల్సి టైపిస్టులంతా తుపాకి దెబ్బకి దొరక్కుండా దాక్కున్నారు. దాంతో మీమీద మరీ మండింది సారుకి. సర్లెమ్మా ఏదో పనుండి మానేసుంటావు. ఇకనుంచి చెప్పి మానెయ్యి. నిన్నజొరమొచ్చిందని చెప్పు'' వీరాస్వామి చిన్నపాటి హరికథ చెప్పాడు. సలహా కూడా ఇచ్చాడు.

''చచ్చాన్రా దేవుడా'' అని నిట్టూర్చింది వినీల. ముందే లీవ్ కావాలని చెబితే ఆకాశం విరిగి పడ్డట్టు మొహం పెట్టి మర్నాడు తనురావడం చాలా అవసరం అంటూ, ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు రేపురావడం మానొద్దని రోజంతా హెచ్చరిస్తాడు. అయినా లీవ్ పెట్టేస్తే, ఇంత చెప్పినా లీవ్ ఎలా పెట్టారని మరీ గింజుకుంటాడు. దానికంటే చెప్పకుండా మానెయ్యడమే మంచిదనుకుంది తను.

ఒక్కసారి భర్త మూర్తి మీద పీకల్దాకా కోపమొచ్చింది వినీలకి. మారేజ్ డే అంతా బైట గడపాలని గండిపేట పోదామని ఒకటే నస పెట్టి లీవ్ పెట్టించాడు. నిన్న ఎంజాయ్ చెయ్యడం ఏమోగానీ ఇవ్వాళ ఛావొచ్చింది. ఆమెకు అరిచేతులు చెమటలు పడుతున్నాయి బాస్ దగ్గరికి పోవాలంటే.

లీవ్‌లెటర్ రాసి మెల్లగా బాస్ దగ్గర ఎవ్వరూ లేనిది చూసుకుని తలుపుతోసింది. ''సర్! నిన్న తలనొప్పి, జ్వరం వల్ల రాలేకపోయాను.'' తలొంచుకుని చెప్పింది. అప్పుడు గుర్తొచ్చిందామెకి తానొక కొత్తచీర కట్టుకుని ఉన్నానని. తల ఇంకొంచెం వంచింది. పెళ్ళిరోజుకి రెండు చీరలు తెచ్చి నిన్నొకటి ఇవ్వాళ ఒకటి కట్టుకోవాలని మూర్తి ఆర్డరు.

తలెత్తి చూసిన ఆఫీసరుగారికి మండింది. 'జ్వరమొచ్చిన మొహమా ఇది ఇంత ఫ్రెష్‌గా తయారయ్యి కులాసాగా కనబడుతోంది. అన్నీ నాటకాలు' చిరాగ్గా అనుకున్నాడాయన. తక్కున స్పృహలో కొచ్చి అవన్నీ మనం ఆలోచించకూడదు. వాళ్ళ లీవ్ వాళ్ళిష్టం అనుకుంటూ ''ఓ.కే. ఓ.కె.హెల్త్ పర్మిట్ చెయ్యనప్పుడు తప్పదు కదా'' అంటూ లీవ్ లెటర్ పై సంతకం పెడుతూ 'ఈ ఆడవాళ్ళు గొప్పనటులు' అనుకున్నాడు.

'బ్రతుకు జీవుడా!' అనుకుంటూ బైటపడి ఊపిరి పీల్చుకుంది. 'నిన్న వీరాస్వామి ఎదురుగా నానా మాటలు అని ఇవాళ పెద్ద మనిషిలా ''హెల్త్ బాగుండనప్పుడు తప్పదు కదా'' అంటున్నాడు. 'ఈ ఆఫీసర్లు మహానటులు' అనుకుంటూ నవ్వుకుంది వినీల.

ఇంటికొచ్చి జరిగిందంతా భర్త మూర్తికి చెప్పి నవ్వించింది వినీల. ''అవునూ! నీకు రావాల్సిన ఎరియర్స్ వెయ్యి వచ్చాయా?'' మాటల మధ్యలో అడిగాడు మూర్తి. 'చచ్చాన్రా దేవుడా' అనుకుంటూ వంటింట్లోకి జారుకుంది వినీల. మూర్తి టి.వి.లో వార్తలు చూస్తున్నాడు. ప్రతిసారీ తనకొచ్చిన జీతంగానీ ఏవైనాగానీ భర్తకే ఇస్తోంది. మూర్తి వాటిని జేబులో వేసేసుకుని చాక్లెట్ కర కరా నమిలినట్టుగా గబుక్కున ఖర్చు చేసేస్తాడు. ఈసారి ఇవ్వకుండా చెవులకి టాప్స్ కొనాలని ఆలోచిస్తోంది. ఆమాట చెప్పొచ్చుకానీ ''ఉన్నాయ్ కదోయ్ నాలుగు రకాలు. మీ ఆడాళ్ళకి ఎన్నున్నా చాలవ్'' అని కొట్టిపారేస్తాడు. ఇప్పుడెన్ని లేటెస్ట్ మోడల్స్ వస్తున్నాయో! ఎలాగైనా ఈసారి కొనేసుకుంటాను. తర్వాతెప్పుడో మెల్లగా చెబుతాను. అనుకుని కుదుట పరచుకుంది మనసుని.

మళ్ళీ భోజనాల దగ్గర గుర్తొచ్చింది మూర్తికా విషయం. ''వినీలా నీ ఎరియర్స్ పైసలు నాకిచ్చేయ్. ఎప్పటినుంచో మావాళ్ళు మంచి పార్టీ ఇవ్వవోయ్ అని చంపుతున్నారు. మంచి హోటల్‌లో వాళ్ళకొకరోజు లంచ్ ఇప్పించేస్తే పోతుంది కదా! ఏమంటావ్'' అన్నాడు.

''అయ్యో! అలాగా! మరి మీరు నాకు ముందొకమాటయినా చెబితే బావుండేది కదా. ఇంత అవసరం ఉందని. ఆ మనీ ఇలా రావడంతోనే మా కొలీగ్ ఒకావిడ వాళ్ళ పిల్లలకి ఒంట్లో బాగోలేదనీ చాలా అవసరం అనీ రిక్వెస్ట్ చేస్తే ఇచ్చేశానండీ'' దిగులు మొహం పెట్టి చెప్పింది.

''ఎప్పుడిస్తుందట తిరిగి?'' అడిగాడు ఆత్రుతగా మూర్తి.

''ఏమోనండీ! కష్టాల్లో ఉండి అడిగింది కదా అని అవన్నీ నేనేడగలేదు.'' మెల్లగా అంది. 'ఫలానా అప్పుడిస్తుందంటే అప్పుడు మళ్ళీ అడుగుతాడేమో! ఇలా అయితే కొన్ని రోజుల్లో మర్చిపోతాడులే' అనుకుంటూ.

మర్నాడే ఓ ఫ్రెండ్‌ని తీసుకుని అబిడ్స్‌పోయి చక్కని టాప్స్ మరి రెండు వందలు వేసి తెచ్చుకుంది. ఒకరోజు పెట్టుకుంటుంటే మూర్తి చూసి అడిగాడు. ''ఇవెక్కడివోయ్'' అంటూ.

''ఇవా! ఇవి ఆర్టిఫీషియల్‌వి. ఇరవై అయిదు రూపాయలు''అనేసింది.

''బావున్నాయి. అచ్చుగోల్డ్‌లానే ఉన్నాయి' 'అన్నాడు ముచ్చటపడుతూ.

''థాంక్‌గాడ్'' అనుకుంటూ నిట్టూర్చింది వినీల.

★★★

ఆరోజు వినీల ఆఫీస్ నుంచి వచ్చేసరికి దిగులుగా కూర్చుని ఉన్నాడు మూర్తి.

''వాట్ డియర్! తలనొప్పిగా ఉందా! చాయ్ చెయ్యనా?'' బాగ్ బీరువాలో పెడుతూ అడిగింది వినీల.

''తలనొప్పిగా ఉండడం కాదు. అమ్మ లెటర్ రాసింది. ఇప్పుడు రావడానికి కుదరదట. తర్వాతెప్పుడో వీలుచూసుకొని వస్తుందట. నిన్ను లెటర్ వ్రాయమన్నది.'' అన్నాడు స్నానానికి బయలుదేరుతూ.

వినీల కొక్కసారి విజిల్ వేసి డాన్స్ చెయ్యాలనిపించింది. బలవంతాన ఆనందాన్ని కంట్రోల్‌చేసుకుంది.

''కారణం ఏమిటిట?'' వాయిస్‌లో కాస్త విచారం మిళాయిస్తూ అంది.

''ఏమో! అమ్మ ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటే ఇలా రాసింది చూడు.'' బుంగమూతి పెట్టుకుని బాత్రూమ్ తలుపేసుకున్నాడు.

అద్దం దగ్గర చేరి చిన్నగా డాన్స్ చేస్తూ ఆలోచనలో పడిందామె. తనింకా అత్తగారు ఎప్పుడు లాండ్ అయిపోతారో అని భయపడి ఛస్తోంది. ఆవిడున్నన్నాళ్ళూ తనకి సరిగా ఊపిరాడనట్టుంటుంది. ఆవిడెన్ని రోజులుంటే అన్ని రోజులూ తను నైటీలు ధరించరాదు. పొద్దున్నే వీధిలో



ముగ్గేసి రావాలి. ''ఏం కూర వండమంటారత్తయ్యా'' అని ప్రతి పూటా అడగాలి. ఆవిడ చాలా గారాలు పోతుంది. ఒక పట్టాన చెప్పదు. ఆ వండింది రుచిగా ఉండకపోతే '' ఆ ఆవకాయ జాడీ ఇలాపారెయ్'' అంటుంది మొహం గంటు పెట్టుకుని. 'కూర బాగా వండనందుకు నీకదే శాస్తి' అన్నంత ధీమాగా. తనింక గిల్టీఫీల యిపోయి కూర బాగా కుదరనందుకు తగు కారణాలు వివరించవలసి ఉంటుంది.

ఆమె ఉన్నన్ని రోజులూ ఆవిడ కొడుకుతో మాట్లాడగా మిగిలిన సమయమంతా ఆమెను ఎంటర్ టెయిన్ చేస్తూ ఉండాలి. బజార్లకీ, ఎగ్జిబిషన్‌లకీ దగ్గరుండి తీసుకెళ్ళి ఆమెకు కావలసినవన్నీ బహు ఓపికగా బేరమాడి కొనిపెట్టాలి. ఆమె ఊర్లో అందరి దగ్గరి నుండీ కావలసిన సరుకుల లిస్టూ, డబ్బులూ రాసి పట్టుకొస్తుంది. అవన్నీ బిల్స్ అడ్జస్ట్ చెయ్యాలి. 'ఊళ్ళో వాళ్ళందరికీ మన మెందుకు ఇవన్నీ సప్లై చెయ్యాలీ?' అని అనడానికి వీల్లేదు. అసలు తానే వాళ్ళందరి ఇళ్ళకూ పోయి మీకేమన్నా కావాలంటే చెప్పండర్రా నేను నా కొడుకింటికి హైదరాబాదు పోతున్నా అని చెప్పి వస్తుందేమో కూడా!

ఆవిడ ఎదురుగా భర్తను ఒక్క చిరాకు మాట కాదుకదా విసుగుచూపు కూడా చూడ కూడదు. 'జన్మజన్మల తపఃఫలం మీరు. నా పూర్వజన్మల పుణ్యాన మీరు నాకు దొరికారు అన్న ఎక్స్‌ప్రెషన్ మొహంలో నిరంతరం కనిపిస్తూ ఉండాలి భర్తతో మాట్లాడేటప్పుడు'

అన్నిటికంటే పరమ బాధాకరమైనది ఆవిడ సొంత డబ్బా. ఆవిడ ప్రతిభ, భర్తపోతే ఉన్న ఒక కొడుకునూ చదివించడానికి ఆవిడ చూపిన చాకచక్యం, ఆవిడ సమయ స్ఫూర్తిని ప్రతిబింబించే అనేక సందర్భాలనావిడ మళ్ళీ మళ్ళీ ఉటంకిస్తున్నా ఫస్ట్ టైమ్ వింటున్నంత ఎడ్మైరింగ్‌గా వినాలి. లేకపోతే ఆవిడ అలిగి ఆకలి లేదంటూ మంచ మెక్కుతుంది. వెంటనే కొడుకు ఆకలి కూడా చచ్చిపోతుంది. అప్పుడు తనొక్కతే రాక్షసిలా భోం చెయ్యవలసి వస్తుంది.

ఆమె నిద్రపోయే వరకూ తామిద్దరూ చంటిపిల్లను నిద్రపుచ్చే తల్లిదండ్రుల్లా ఆమె వెంట తిరగాలి. మంచంపై కూర్చోవాలి. అప్పుడావిడ ఆనందంతో బుడుంగున నిద్దరోతుంది. అపుడు మిగిలిన కార్యక్రమాలు చూసుకోవాలి.

భర్త స్నానం చేసి వచ్చాక తాను స్నానానికి బయలుదేరింది వినీల. మళ్ళీ ఆలోచనల్లో పడింది. ఇప్పుడు నేనేం చెయ్యాలి. గప్ చుప్‌గా ఊరుకోవచ్చుకానీ సమ్మర్ వచ్చేస్తోంది. సమ్మర్‌లో తనకి హాయిగా అంతర్వేదిపాలెంలో గడపా లనుకుంటుంది.

మూర్తేమో 'నిన్నొదిలి ఉండలేను నేను కూడా వస్తాన'ని తయారవుతాడు. మూర్తితో కలిసి పుట్టింటికి వెళితే తనకు రెండు, మూడు రోజుల కంటే ఉండ బుద్ధి కాదు. అందరూ మూర్తికి మర్యాదలు చేస్తూ అతన్నే ఎంటర్ టెయిన్ చేస్తూ ఉంటారు అమ్మా, నాన్నలతో సహా.

''మీ ఆయన్ని తీసుకుని అలా కాలవ గట్టుకు వెళ్ళరాదూ!'' అంటుందమ్మ. తనింక మూర్తికి గైడ్‌లా అన్నీ వివరిస్తూ కనబడ్డవాళ్ళని ఆయనకి పరిచయం

చేస్తూ అతని సందేహాలు తీరుస్తూ, పరమబోర్. 'అతనంటే ఎంత ప్రేమున్నా తను ఇరవయ్యేళ్ళు పుట్టి పెరిగిన వాతావరణంలో భర్తతోకాక ఒంటరిగా గడపాలని పిస్తుంది. గత స్మృతులను ఒక్కదాన్నే నెమరువేసుకోవాలనిపిస్తుంది.

ఇంట్లోంచి బయలుదేరి స్వేచ్ఛగా అలా ఊరి వీధుల్లో తిరుగుతూ కనబడ్డవాళ్ళందరినీ పలకరిస్తూ ఉంటే ఎంత టైమూ చాలదు. తనకి అక్షరాభ్యాసం చేసిన కూర్మారావుగారిని, తనని స్కూల్లో వేసిన కొత్తల్లో ఏడుస్తుంటే బరబరా లాక్కుపోయిన ఆయా రామినీ పలకరించడం తనకెంతో ఇష్టం. ఆ మాష్టార్లందరూ ఇప్పుడు ముసలివాళ్ళయ్యి అరు గులమీద కూర్చుని వచ్చేపోయేవాళ్ళని పట్టుకుని ఇంటర్వ్యూలు చేస్తూ కాలక్షేపం చేస్తుంటారు.

ఊరిలో అందరూ బంధువులే. ఎవరో ఒకరింట్లో జొరబడి చక్కగా వాళ్ళతో సేటీ విశేషాలు చెబుతూ, జోక్స్ వేస్తూ అక్కడే భోం చేసేసి ఇంటికొచ్చి అమ్మతో తిట్లు తినడం ఎంతో మధురం తనకు.

సాయంత్రాలు గుడికిపోతే ఊరికి దూరంగా ఉండేవాళ్ళు కూడా కనబడతారు. గుడివెనక పచ్చగడ్డిలో కూర్చుంటే ట్యూబ్‌లైట్ వెలుగులో వాతావరణం ఎంతబావుంటుందో! తన స్నేహితురాళ్ళలో ఎవరో ఒకరైనా దొరక్కపోరు తనకి కబుర్లకి. అలాటైమ్ గడుపుతూ ఉంటే తిరిగి ఒక్కసారి బాల్యం లోకిపోయిన అనుభూతి.

ఒక్కమాటలో చెప్పుకోవాలంటే తిరిగి పెళ్ళికాని పిల్లలా తిరగాలనిపిస్తుంది. భర్తతో జీవితం కలలా ఊరిలో జీవితం నిజంలా ఒకనెల గడపాలనిపిస్తుంది.

ఈ అనుభూతులన్నీ మూర్తితో వెళితే బంద్. తన కోరిక తీరాలంటే ఒకే ఉపాయం ఉంది. అది అత్తయ్యని ఇప్పుడే తీసుకువచ్చి ఓ నెల రోజులు వీర సేవలు చేసి మెప్పించి అమ్మరాసిన ఉత్తరాలు చూపించి ఆవిడ మనసును కరిగించి ''ఒక్క వారం రోజులుండండత్తయ్యా! నేనిట్టే వెళ్ళి అమ్మానాన్నలకి మొహం చూపించి అట్టే వచ్చేస్తా''నని తల్లీ, కొడుకుల్ని ఇక్కడ వదిలేసి తను ఝుమ్మని నర్సపూర్ ఎక్స్‌ప్రెస్‌లో కోనసీమ వెళ్ళిపోయి కొబ్బరిబోండాలు తాగుతూ నవ్వుకోవాలి.

అలావెళ్ళి ఓ ఇరవైరోజులు గడిపేసి మెల్లగా అమ్మచేత అత్తయ్య కిష్టమైన పిండివంటలు చేయించుకుని వస్తే ఆవిడా ఖుషీ. ఏదో అమ్మతో ఉన్నట్టు మూర్తికీ ఉంటుంది. 'నిన్నొదిలి నేనుండలేను' అని వెంటపడే ఛాన్స్‌లేక మూర్తి కూడా ఊరుకుంటాడు.

తక్షణం తన ప్లాన్ అమలు పరచడానికి ఉపక్రమించింది వినీల. భోజనాలు వడ్డిస్తూ అంది. మీ అమ్మకు ''అక్కడేం లేని ఉందిటా రాకపోవడానికి. రేపు నేను లెటర్ రాస్తానుండండి. నా లెటర్ చూసి అత్తయ్య పెట్టె సర్దుకోవలసిందే.'' మూర్తి సంతృప్తిగా భార్యవైపు చూశాడు.

మర్నాడే ఆఫీస్‌లో లంచ్ అవర్‌లో కూర్చుని లెటర్ రాయడం మొదలుపెట్టింది.

అత్తయ్యా!

మీరాక కోసం ఎంతో ఆశగా ప్రతిరోజూ ఎదురు చూస్తూ ఉంటే మీరలా రాను పొమ్మని లెటరు రాయడానికి మీ మనసెలా ఒప్పిందత్తయ్యా! మీ అబ్బాయి ప్రతి పూటా ''అమ్మరాలేదేమిటే!'' అని బాధపడుతున్నారు.

మీరిక్కడ ఉంటే మాకెంతో ఆనందంగా, కొండంత ధైర్యంగా ఉంటుంది. అక్కడ ఉంటే ఏం తిన్నారో, ఆరోగ్యం ఎలా ఉందో అని మాకు ఒకటే దిగులుగా ఉంటుంది. అసలు మీరు ఎప్పటికీ మాదగ్గరే ఉంటే మాకెంతో బావుంటుంది. మీరేమో ఇల్లూ, పొలం అంటూ అక్కడే ఉండాలని చూస్తారు.

మీకిక్కడ ఎటువంటి ఇబ్బంది ఉన్నా మీరు గట్టిగా చెప్పెయ్యండి. ఇది మీ ఇల్లు. మీకంటే మాకేమీ ముఖ్యం కాదు. మీకీ ఇల్లు నచ్చకపోతే ఇంకో ఇంటికి మారిపోదాం.

ఈ లెటరు అందిన వెంటనే మీరు ఇల్లు పక్కవాళ్ళెవరికైనా అప్పచెప్పేసి బయలుదేరి రాగలరు. మీరింకా ఆలస్యం చేస్తే మేమిద్దరం అక్కడికి వచ్చేసి మిమ్మల్ని తీసుకువస్తాము. మాకు శ్రమ ఇవ్వకూడదనుకుంటే మీరు తక్షణం బయలుదేరండి.

మీరాకకై ఎదురుచూస్తూ నమస్కారములతో

మీకోడలు

వినీల.

లెటర్ పోస్ట్ చేసి వేసవిలో తను గడపబోయే మధుర క్షణాలను తల్చుకుని థ్రిల్లయింది.

ఇంటికి రాగానే భర్తకు చెప్పింది. ''నా లెటర్ చదివి మర్నాడే అత్తయ్యగారు బయలుదేరతారు చూడండి. అంత ఘాటుగా రాశాను ఉత్తరం.''

''కొడుకుమీద కంటే కోడలి మీదే ఎక్కువ ప్రేమ మా అమ్మకు. తప్పకుండా వచ్చేస్తుంది.'' భార్యవైపు అభిమానంగా చూస్తూ అన్నాడు మూర్తి.




★★★

''వినీలా! నంది అవార్డ్స్ రా! రా!'' పిల్చాడు మూర్తి. కిచెన్‌లో వంట చేస్తున్నదల్లా పరుగు పరుగున వచ్చి టి.వీ. ముందు కూర్చుంది వినీల.

నంది అవార్డ్స్ ప్రదాన కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఉత్తమ నటుడు, ఉత్తమనటి, ఇతర నటులు-అవార్డులు ఇస్తున్నారు. వారికి అవార్డులు రావడానికి కారణభూతమైన సినిమాలలోని బిట్స్ వేస్తున్నారు. నిజమే ఇతనికి ఈ అవార్డు ఇవ్వవలసిందే అనిపిస్తోందా సీన్స్ చూస్తుంటే.

సడెన్‌గా వినీలమదిలో కెరటంలా ఒక ఆలోచన తోసుకుని వచ్చింది. 'వాళ్ళందరూ నటన అభ్యాసంగా ఉన్నవాళ్ళు. సీన్‌కి ముందు మెంటల్‌గా ప్రిపేరవుతారు. రచయిత రాసిన డైలాగులు బట్టీ పడతారు. ఆపై మేకప్, సెట్టింగ్ ఉంటాయి. దానితోనే సగం గెటప్ వచ్చేస్తుంది. రిహార్సల్స్ చేస్తారు. అప్పుడు చక్కగా ఫీలింగ్స్ చూపెడుతూ అవసరమయితే రెండు మూడు టేక్స్ తీసుకుని నటించి ఒప్పిస్తారు ప్రేక్షకుల్ని.

కానీ మనమందరం నిత్యజీవితంలో రోజుకి ఎన్నోసార్లు నటించేస్తూ ఉంటాం. అప్పటికప్పుడు మనసులోనే సందర్భాన్ని బట్టి డైలాగులు రాసేసుకుని ప్రాక్టీస్ లేకుండా నటించేస్తాం. మేకప్ ఉండదు. రిహార్సల్ ఉండదు. అసలు నిజంగా మనమే గొప్పనటులం. మన నటనే గొప్పది. మనక్కూడా ఎవరన్నా పోటీ పెట్టి అవార్డులిస్తే బావుండును. మన నటనముందు వాళ్ళ నటన దిగదుడుపే.'

''ఏమిటోయ్! నీలో నువ్వే నవ్వేసుకుంటున్నావ్. టీ.వీ. చూడడం మానేసి'' భర్త మురిపెంగా అడిగాడామెను.

''నటన అనేది వృత్తిమాత్రమే కాదు. తోటివారితో, దైనందిన జీవితంలో నొప్పింపక తానొవ్వక మనిషి సాఫీగా జీవితం సాగించాలంటే ఇన్‌స్టెంట్ నటన ఒక నిత్యావసరం'' అంది మధురంగా నవ్వుతూ.

''నువ్వన్న మాటలేంటో, వాటి భావాలేంటో నాకొంచెం కూడా అర్థం కాలేదు'' అన్నాడు మూర్తి దీక్షగా టి.వీ. చూస్తూ.

''కొన్ని విషయాలూ, అయిడియాలూ అర్థం కాకపోవడమే అందరికీ మంచిది'' అంది ముసిముసిగా నవ్వుతూ.

''ఇది కూడా అర్థం కాలేదు'' అన్నాడు మూర్తి బిక్కమొహం వేస్తూ.

''ఏం లేదు. మీరు టీ.వీ చూసుకోండి. నేను వంట చేసుకోవాలి అంటున్నాను'' అంది వినీల లేచి కిచెన్ లోకి దారి తీస్తూ వచ్చే నవ్వును ఆపుకుంటూ.

★